కార్మికులకు ఐఎన్‌టీయూసీ ఎంతో నష్టం చేసింది



సమావేశంలో మాట్లాడుతున్న ముద్దాపురం మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: గతంలో ఐఎన్‌టీయూసీ సంఘం చేసిన అగ్రిమెంట్ ద్వారా కార్మికులు తీవ్రంగా నష్టపోయారని టీఆర్‌ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. బాలనగర్ ఇండస్ట్రీ ఏరియాలోని బయో కెమికల్ సింథటిక్ ప్రాడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం సాయంత్రం గేట్ మీటింగ్ నిర్వహించారు.

◆ 23 మంది కార్మికులను పర్మనెంట్ చేయించాం..

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మదన్‌గౌడ్ మాట్లాడుతూ... గతంలో తాము రెండు అగ్రిమెంట్లు చేసి లీవ్‌లను పెంచి 23 మంది కార్మికులను పర్మనెంట్ చేసి రూ.6,100 పెంచామన్నారు. కానీ ఐఎన్‌టీయూసీ సంఘం రూ.4,700 అగ్రిమెంట్ చేసి రూ.1400 కార్మికులు నష్టపోయే విధంగా చేసిందన్నారు. ఈనెల 6వ తేదీన జరిగే ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

◆ మదన్‌గౌడ్‌ను గెలిపిస్తే కార్మికులకు మేలు

మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ.. కార్మికులకు ఐఎన్‌టీయూసీ ఎంతో నష్టం చేసిందన్నారు. మదన్‌గౌడ్‌ను గెలిపిస్తే కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు వట్టికూటి రామారావు, యోగా మాస్టారు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కె.సుభాష్, కె.రాంబాబు, గురుద్వార్ సెక్రటరీ సుమిత్, జనరల్ సెక్రటరీ మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, వివిధ పరిశ్రమల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. గోదావరి పరివాహక ప్రాంతం, తెలంగాణలో ఉన్న బొగ్గు గనులను సింగరేణికి కేటాయించకుండా వేలం ద్వారా కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. దీనిని నిరసిస్తూ జగద్గిరిగుట్టలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద శుక్రవారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సింగరేణికి బొగ్గు గనులు రాకపోతే రాబోయే పదేళ్లలో సింగరేణి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. అలా జరిగితే మొత్తం బొగ్గు గనులు ప్రైవేట్ పరం అయ్యి విద్యుత్ భారం ప్రజలపై పడుతుందన్నారు. ఇలాంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాములు, సహదేవ్‌రెడ్డి, ఇమామ్, బాబు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ.59ను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములు కబ్జా

భూములను పరిరక్షించాలని తహసీల్దార్‌కు సీపీఐ వినతి



తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: ప్రభుత్వ భూములను జీఓ నం.59ను అడ్డం పెట్టుకుని కబళిస్తున్నారని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లోని ప్రభుత్వ సర్వే నంబర్లలోని భూములను పరిరక్షించాలని తహసీల్దార్ పూల్‌సిగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి జీఓ నం.59 కింద దరఖాస్తు చేసుకున్న విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశించినా ఇంత వరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికే చెరువు శిఖం భూములను కబ్జా చేసి బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, మల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

రంగారెడ్డినగర్: అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం విజయనగర్‌కాలనీలోని పోచమ్మ ఆలయంలో జరిగిన మండల పూజ మహోత్సవానికి శ్రీశైలంగౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎండీ రియాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, తోకల శీను, శ్రీధర్, నరసింహగౌడ్, సుధాకర్‌గౌడ్, ఏలేష్, మదన్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కరరావు, చిలక సతీష్ , మమత, స్వర్ణలత, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మండల పూజ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

వీడిన అనిల్‌కుమార్ హత్య మిస్టరీ

- అక్రమ సంబంధమే హత్యకు దారి తీసింది: డీసీపీ
- పోలీసులు అదుపులో మల్లేష్, భాగ్యలక్ష్మి, నాని, నవీన్
- పరారీలో మరో ఇద్దరు నిందితులు రాజు, సంజూ



కేసు వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 28న గాజుల అనిల్‌కుమార్ హత్య కేసు మిస్టరీ వీడింది. అక్రమ సంబంధమే హత్యకు దారి తీసిందని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. మృతుడు గాజుల అనిల్‌కుమార్ అనిల్ స్వస్థలం మెదక్ జిల్లా అల్లాదుర్గం. 2008లో భాగ్యలక్ష్మిని వివాహం చేసుకున్నాడు.కూకట్‌పల్లిలో అద్దెకు ఉండేవారు. భాగ్యలక్ష్మి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో తన సొంత బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించింది. తమ బంధువైన కృష్ణవేణి ఆమె భర్త, పిల్లలతో కలిసి గోషామహల్ ప్రాంతంలో ఉండేది. కాగా కరోనా సమయంలో భాగ్యలక్ష్మి స్వగ్రామానికి వెళ్లడంతో కృష్ణవేణి అనిల్‌కుమార్‌తో సన్నిహితంగా మెలిగింది. ఆ తర్వాత భర్తతో విభేదాలు రావడంతో కృష్ణవేణి మూడేళ్ల క్రితం పిల్లలతో కలిసి కూకట్‌పల్లికి మకాం మార్చింది.

భార్యకు అక్రమ సంబంధ తెలియడంతో..

అక్రమ సంబంధం తెలుసుకున్న భాగ్యలక్ష్మి అనిల్‌కుమార్‌ను ప్రశ్నించినప్పుడల్లా దాటవేసేవాడు. ఆ తర్వాత భాగ్యలక్ష్మి వెంకటేశ్వరనగర్‌లో టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించింది. అందులో మాస్టర్‌గా పనిచేసే మల్లేష్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. శ్రీనివాసనగర్‌లోని అంబులెన్స్‌లు, ఇంటిలో వాటా ఇస్తానని చెప్పడంతో భాగ్యలక్ష్మి భర్త కృష్ణవేణికి తెలిపాడు. ఇది జీర్ణించుకోలేని భాగ్యలక్ష్మి భర్త అనిల్‌ను హత్య చేసేందుకు మాస్టర్ మల్లేష్‌తో కలిసి పథకం వేసింది.

హత్యకు రూ.2లక్షల సుపారీ..

అంబులెన్స్ డ్రైవర్లు పనిచేసే నాని, నవీన్‌ను వారు సంప్రదించారు. హత్యకు రూ.2లక్షలు డిమాండ్ చేశారు. ఒప్పందం కుదరడంతో నాని, నవీన్ మరో ఇద్దరిని (రాజు, సంజూ) కలుపుకొని హత్య చేయడానికి పూనుకున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం గత నెల 28న రాత్రి సుమారు 9గంటలకు అనిల్‌కుమార్ తన ఇంట్లో ఒంటరిగా మద్యం సేవిస్తున్నాడు. భాగ్యలక్ష్మి ఇచ్చిన సమాచారం మేరకు నాని, నవీన్, సంజూలు అక్కడికి చేరుకొని అనిల్‌తో కలిసి మద్యం సేవించారు. మత్తులో ఉన్న అనిల్‌ను కత్తితో పొడిచి హాక్సా బ్లేడ్‌తో గొంతు కోసి దారుణంగా హత్య చేశారు.

ఏమీ తెలియనట్లు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి...

ఆ తర్వాత ఎల్లమ్మబండ శ్మశానవాటికలో గోడ పక్కనే ఉన్న రక్తపు మరకలను వదిలేసారు. మరుసటి రోజు భాగ్యలక్ష్మి మృతదేహాన్ని ఏమీ తెలియనట్లు మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించింది. మల్లేష్, భాగ్యలక్ష్మి, నాని, నవీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసింది తామేనని తెలిపారు. రాజు, సంజూ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించనున్నట్లు తెలిపారు. జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి

సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్



జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్

సుభాష్‌నగర్: జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ సందర్శించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తా నుంచి సూరారం వరకు ప్రధాన రోడ్డును బాలానగర్ ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రగా ఉంటుందనే దానిపై ఆరా తీశారు. చింతల్, షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వెలసిన చిరు వ్యాపారాల డబ్బాలను తొలగించి వాహనాలు సులువుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని జోయల్ డేవిస్ ఆదేశించారు.

◆ కుత్బుల్లాపూర్ చౌరస్తా వై జంక్షన్ నుంచి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ వరకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోయిన విషయాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. వాహనాల వేగాన్ని తగ్గించడానికి, బారికేడ్లు, రోడ్డుపైకి వచ్చిన చెట్లు, రోడ్డు లైనింగ్, రోడ్డు వెడల్పు ఇతర ఆరు సమస్యలతో కూడిన లేఖను జీహెచ్‌ఎంసి అధికారులకు రాశారు. అనంతరం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సందర్శించి పోలీస్‌స్టేషన్‌లో ఫైళ్లను తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును తెలుసుకున్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించొద్దు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.నాగరాజు అన్నారు. కొంపల్లిలోని చెన్నై, సౌత్ ఇండియా షాపింగ్ మాళ్ల సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. మాల్స్‌కు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్లపై నిలపకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా రాంగ్ రూట్‌లో వస్తున్న 12 బైక్‌లు, ఒక ఆటోను సీజ్ చేసి పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. మరోసారి ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించవద్దని అవగాహన కల్పించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి కాలనీలోని రోడ్ నం.2లో బాలకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో చాలా రోజులుగా పఠాన్‌చెరు ప్రాంతానికి చెందిన వీరారెడ్డి (35), శివ అద్దెకు ఉంటున్నారు. వీరు అద్దె సరిగా చెల్లించకపోవడంతో వీరిని గది ఖాళీ చేయాలని బాలకృష్ణ కోరారు. దీంతో శివ సొంత ఊరికి వెళ్లగా బాలకృష్ణ ఒక్కడే గదిలో ఉన్నాడు. శుక్రవారం ఉదయం గది నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి ఇంటి యజమాని బాలకృష్ణకు సమాచారం అందించారు. బాలకృష్ణ గది తలుపులు తెరచి చూడగా అందులో వీరారెడ్డి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతుడి కుటుంబీకుల ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఎన్నికల హామీల మేరకు పింఛన్లు పెంచాలి



మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని మేడ్చల్ జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట వికలాంగులు, ఎమ్మార్పీఎస్ మహా ధర్నా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ మేనిఫెస్టోలో పెట్టిన దివ్యాంగుల పెన్షన్ రూ.6000లకు అదేవిధంగా వృద్ధులు, వితంతువులకు రూ.4000 పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.శాంతాబాయి, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్‌కుమార్ మాదిగ, సిలివేరు శ్రీనివాస్‌మాదిగ, రాసమల యాదగిరి మాదిగ, ఇసురం రమేష్ మాదిగ, సలోమీ మాదిగ, వెంకటేష్. దివ్యాంగులు, నాయకులు పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి ఎప్పుడూ సహకారం ఉంటుంది

డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: పశుపక్షాదులకు ఆహారాన్ని అందించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్‌లోని గోశాలను 7వ డివిజన్ కార్పొరేటర్ ప్రణయయాదవ్‌తో కలిసి డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా గోగ్రాసాన్ని అందించి కుటుంబ సమేతంగా గోసేవ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశుపక్షాదులకు ఆహారాన్ని, తాగునీటిని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. గోశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

బఫర్ జోన్‌లోని 17 నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్: చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిజాంపేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. మల్లంపేటలోని కత్వ చెరువును ఆక్రమించి నిర్మించిన శ్రీలక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మల్లంపేటలో సర్వే నం. 170/3, 170/4, 170/5 ప్రభుత్వ, చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన 17 అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వహించొద్దు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అశ్రద్ధ వహించొద్దని... ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా అధికారులు వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, పలువురు కార్యకర్తలు ఆయనను కలిశారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు శుభకార్యాలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కుత్బుల్లాపూర్: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.విజయవర్ధన్ వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండలం రాజ్‌పేట్ గ్రామానికి చెందిన బొల్ల నవీన్ (20) జీడిమెట్లలోని అంగన్‌పేట్‌లో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నవీన్ సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్‌లను దొంగలించడం ప్రారంభించారు. మరోసారి దొంగతనానికి పాల్పడేందుకు ప్రయతిస్తున్న నవీన్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. సమావేశంలో డీఐ నర్సింహరాజు, డీఎస్ఐ సి.నర్సింహులు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రాజేందర్, రవికిశోర్, గణపతి, కిశోర్‌రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీలోని శ్రీఅభయాంజనేయ ఆలయ 6వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్‌నాయక్, గోపాల్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సంజీవ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుంటి నాగరాజు, జక్కుల శ్రీనివాస్‌యాదవ్, నల్తూరి కృష్ణ, జీతయ్య, మొర అశోక్, కొర్ర రవీందర్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య శుక్రవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లో ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు ప్లాట్లుగా చేసి పేదలకు విక్రయిస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో భూమాఫియా రూ.కోట్లాది విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేసిందన్నారు. ప్రధానంగా జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ భూమిని భూకబ్జాదారులు సంఘాల పేరుతో విచ్చలవిడిగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ప్రజావాణిలో ఇంచార్జ్ చిన్నపరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అలాగే కుత్బుల్లాపూర్‌లో ప్రభుత్వ భూములు కాపాడి రెసిడెన్షియల్ కళాశాలకు, జగద్గిరిగుట్ట ఆర్టీసీ డిపోకు, విద్యుత్ ఉపకేంద్రానికి స్థలం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిష్ కో-ఆపరేటివ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చినంగి వెంకటేశం ముదిరాజ్ అన్నారు. పశు సంవర్థక, మత్స్యశాఖల ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను శుక్రవారం సచివాలయంలో కలిసి సమస్యలను వివరించారు. అదే విధంగా ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్ల ప్రక్రియ మొదలు కానున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని కోరానన్నారు. నాన్‌వెజ్ మార్కెట్లు నిర్మించాలని.. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్లు అందించాలని విన్నవించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరి శంకర్, గుండు సురేశ్, రమేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.